సాక్షి గుంటూరు

శనివారం । 13 । జూలై । 2024



వైభవంగా హరిద్ర శృంగారార్చన

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి ఆలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. బండ్లమ్మను మహా గౌరీదేవిగా అలంకరించారు.



పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్: కాళికా మాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆషాఢమాస ఉత్సవాలు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో దేశమ్మ తల్లి ఆషాఢమాస ఉత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. పొంగళ్లు పొంగించి, జలబిందెలతో అమ్మవారికి వారుపోశారు.

న్యూస్‌రీల్

నేడు కొలనుకొండకు సీఎం చంద్రబాబు



తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం తాడేపల్లి మండల పరిధిలోని కొలనుకొండలోని హరే కృష్ణ గోకుల క్షేత్రంలో అనంత శేష స్థపన కార్యక్రమంలో పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎస్పీ తుషార్ డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆమె సీఎం పాల్గొననున్న పూజా కార్యక్రమ స్థలాన్ని, సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి తహసీల్దార్ విజయకుమార్, ఆర్‌అండ్‌బీ, విద్యుచ్ఛక్తి, ఎంటీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ


గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పీఎం కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధికి అధికారి పి.ప్రణయ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్, హోం అప్లయన్సెస్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ వృత్తులలో టెన్త్ విద్యార్హత కలిగిన 16 నుంచి 45 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు ఈనెల 15 నుంచి రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు 98663 66187, 95332 19919 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యార్డులో 25,626 బస్తాల మిర్చి విక్రయం




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,027 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,626 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,500 నుంచి రూ.18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,347 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,716 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 476 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 0 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 0 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 0 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1,005 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4500, మోడల్ ధర రూ.3700 వరకు పలికింది.

మస్తిష్కం.. మరణ వేదన

బ్రెయిన్ స్ట్రోక్.. బీకేర్‌ఫుల్

- యుక్త వయస్సులోనే బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు
- గుంటూరు జీజీహెచ్‌కు రోజూ పది మందికిపైగా బాధితులు
- ముందస్తు అవగాహనతో పక్షవాతం దూరం

◆ పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన రామయ్య ఇటీవల గుంటూరులోని ఓ సినిమాహాల్ వద్ద అకస్మాత్తుగా కుప్పకూలాడు. స్థానికులు అతడిని సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి సెల్ ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యులు బ్రెయిన్ స్ట్రోక్‌గా నిర్ధారించి వైద్యం అందించేలోగా అతను మరణించాడు. ఏ రోజూ అనారోగ్యంతో ఇబ్బంది పడని వ్యక్తి అకస్మాత్తుగా బ్రెయిన్‌స్ట్రోక్‌కు ఎందుకు గురయ్యాడో అర్థం కాక కుటుంబ సభ్యులు విలపించారు.

◆ గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన రాజేష్ అరు నెలల క్రితం పక్షవాతం(బ్రెయిన్ స్ట్రోక్) రావటంతో ఎవరో చెప్పిన మాట విని ఆకుపసర తీసుకున్నాడు. దీంతో వ్యాధి తగ్గకపోగా శాశ్వత అంగవైకల్యం వచ్చింది. వికలాంగుల సర్టిఫికెట్ కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు.



గుంటూరులోని జీజీహెచ్‌లో పక్షవాతంతో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

గుంటూరు మెడికల్: మస్తిష్కం మరణ వేదనకు గురవుతోంది. బ్రెయిన్ స్ట్రోక్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రస్తుత ఒత్తిళ్లమయ జీవనంలో యువత కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు అవగాహన, జాగ్రత్తలతో బ్రెయిన్ స్ట్రోక్‌కు దూరంగా ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ అంటే..

బ్రెయిన్ స్ట్రోక్‌ను పక్షవాతం అని కూడా పిలుస్తారు. పక్షవాతాన్ని వైద్య పరిభాషలో సెరిబ్రో వాస్క్యులర్ యాక్సిడెంట్ అని పిలుస్తారు. దీనివల్ల శరీరంలో ఏదో ఒక భాగం చచ్చుబడుతుంది రక్తనాళాల్లో రక్త ప్రవాహంలో ఒత్తిడి తీవ్రంగా పెరిగితే రక్తస్రావం జరుగుతుంది. మెదడులో రక్తస్రావం జరిగినా, రక్తం గడ్డ కట్టినా పక్షవాతం వస్తుంది. బీపీ, షుగర్, ఒత్తిడి వల్ల చిన్న వయస్సులోనే చాలా మంది బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. మెదడులో కణుతులు, ధూమ, మద్యపానం వల్ల రక్తనాళాలు దెబ్బతిని పక్షవాతం వస్తుంది. రక్తంలో కొవ్వు పదార్థాల వల్ల, స్థూలకాయం వల్ల, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన కారణాల వల్ల, ఇన్‌ఫెక్షన్ వల్ల వ్యాధి వస్తుంది.

లక్షణాలు..

కొందరికి ఒకే వస్తువు రెండుగా కనబడతుంది. మాట తడబాటు, అయోమయంగా మాట్లాడటం, మింగుడు పడకపోవటం, నీరు సరిగా తాగలేకపోవటం, నీరు తాగబోతే ముక్కు వెంట కొంత బయటకు రావటం, కళ్లు తిరగటం, తల తిరగటం, అకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, నడకలో తూలుడు, చేయి, మూతి వంకరపోవటం, దృష్టి మందగించటం, కాళ్ళు చేతులు ఉన్నట్టుండి బలహీన పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో రోగి కోమాలోకి వెళ్తాడు.

ముందస్తు జాగ్రత్తలు

షాలిష్ బియ్యం కాకుండా ముడి బియ్యం తినాలి. రాగులు, సజ్జలు, జొన్నలులాంటి చిరుధాన్యాలు తీసుకోవాలి. రోజూ యోగా, నడవటం చాలా మంచిది. జీవనశైలిని మార్చుకోవాలి. ఇంట్లో, బయట పొల్యూషన్‌కు దూరంగా ఉండాలి. రక్తపోటును, షుగర్‌ను అదుపులో పెట్టుకోవాలి. ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి. కొవ్వు పదార్థాలు తినరాదు. స్థూలకాయం తగ్గించుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి.

జిల్లాలో బాధితుల సంఖ్య..

గుంటూరు జీజీహెచ్‌కు రోజూ 15 నుంచి 20 మంది బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. న్యూరాలజీ వార్డులో ఏపీలో తొలిసారిగా ప్రత్యేక స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రి కంటే దీటుగా ఈ యూనిట్ వైద్య సేవలు అందిస్తోంది. ప్రతినెలా స్ట్రోక్ యూనిట్‌లో 700 నుంచి వెయ్యి మందికిపైగా బాధితులు న్యూరాలజీ స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. జిల్లాలో 20 న్యూరాలజీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయి. రోజూ ఒక న్యూరాలజీ వైద్యుడు ఇద్దరు లేదా ముగ్గురు పక్షవాత బాధితులను కొత్తగా గుర్తించి వైద్యసేవలను అందిస్తున్నారు.

నాలుగు గంటల్లోనే వైద్యుడి వద్దకు వెళ్లాలి



పక్షవాతం వచ్చిన వెంటనే గంట నుంచి 4.30 గంటల వ్యవధిలోనే న్యూరాలజీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి. ఇది గోల్డెన్ అవర్. నిర్ణీత సమయంలో వైద్యుడి వద్దకు వెళితే త్వరగా కోలుకునే అవకాశం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ నాటు వైద్యం జోలికి వెళ్లవద్దు. అపస్మారక స్థితి నుంచి బయటకు వచ్చిన రోగికి ధైర్యం చెప్పాలి.

– డాక్టర్ సిహెచ్. శివరామకృష్ణ, న్యూరాలజిస్టు, గుంటూరు

ఆకు పసర్లతో ముప్పే



పక్షవాతంపై అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పక్షవాత రోగికి ప్రతి పూట పొజిషన్ మారుస్తూ వీపు, పిరుదులపై పుండ్లు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. చచ్చుబడిన భాగాలకు కాపడం పెట్టరాదు. రోగిని మాట్లాడించే యత్నం చేయాలి. ఆకుపసర్లు, నాటు వైద్యం వ్యాధిని తగ్గించలేవు. పైగా ప్రమాదకరం.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, న్యూరాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం



గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో పక్షవాతం రోగులకు ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటుచేసి కార్పొరేట్ తరహా వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నాం. 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. సుమారు రూ.45 వేలు ఖరీదు చేసే ఇంజక్షన్లు ఉచితంగా చేస్తున్నాం. రోజూ ఓపీ వైద్య విభాగంలోని 10వ నంబర్ గదిలో ఈ వైద్య సేవలు లభిస్తున్నాయి.

– డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరాలజీ విభాగాధిపతి, జీజీహెచ్

దినసరి కూలీల వేతనాలు ఏప్రిల్ నుంచి అమలు చేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: 2024–25 ఆర్థిక సంవత్సరానికిగానూ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న దినసరి కూలీలకు (ఎన్ఎంఆర్) నిర్దిష్ట వేతనాలు అమలు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత నైపుణ్యం కలవారికి రూ.870, నైపుణ్యం కలవారికి రూ.825, పాక్షిక నైపుణ్యం కలవారికి రూ.715, నైపుణ్యం లేనివారికి రూ.600 రోజువారీ వేతనంగా నిర్ణయించామని పేర్కొన్నారు. ఇది ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వర్తిస్తుందని వివరించారు.

రేపు దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ 14వ తేదీ ఆదివారం బంగారు బోనం సమర్పించనుంది. ఆ రోజు ఉదయం అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టువస్త్రాలు సమర్పించేందుకు కమిటీ ప్రతినిధులు ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి విచ్చేయనున్నారు. శనివారం సాయంత్రమే నగరానికి చేరుకునే ఉత్సవ కమిటీ ప్రతినిధులతో పాటు బేతాళనృత్య కళాకారులు, తీన్‌మార్ డప్పు కళాకారులు, పోతురాజులు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి బయలుదేరతారు. ఆలయ ఈవో కేఎస్ రామరావు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. జూలై 26వ తేదీన ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరఫున పాతబస్తీలోని అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించనుంది.

'ఆషా'జనక సంకేతం

- 'తెర'తెరాల తెనాలి వైభవం
- ఆంధ్రాప్యారిస్‌లో కొత్త 'షో'యగం
- ఆషా థియేటర్ ఆధునికీకరణ ప్రారంభం
- వరుసగా థియేటర్లు మూతపడుతున్న వేళ శుభసూచిక



ఆషా థియేటర్ రెనోవేషన్ పనులకు శ్రీకారం

తెనాలి: వరుసగా సినిమా థియేటర్లు మూతపడుతున్న ఆంధ్రాప్యారిస్ తెనాలిలో ఎంతోకాలంగా మూత పడి ఉన్న ఆషా డీలక్స్ థియేటర్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. సరికొత్త హంగులతో కొత్తగా థియేటర్ రానుండటం విశేషమే కదా! ఈ నేపథ్యంలో తరతరాలుగా తెనాలిలో థియేటర్ల వైభవం గురించి ఓసారి తెలుసుకుందాం..

ఉజ్వలంగా వెలిగిన థియేటర్లు

రత్నా టాకీస్, శ్రీవేంకటేశ్వర, శ్రీసత్యనారాయణ.. ఇవన్నీ తెనాలిలో ఒకప్పుడు ఉజ్వలంగా వెలిగి అదృశ్యమైన సినిమా థియేటర్లు. ప్రేక్షకులకు వెండితెర వినోదాన్ని పంచిన ప్రముఖ థియేటర్లు కొన్నేళ్లగా ఒకదాని తర్వాత మరొకటిగా మూతపడుతూ వచ్చాయి. తర్వాత అవన్నీ షాపింగ్ కాంప్లెక్సులు, కల్యాణ మండపాలుగా మారాయి. ప్రస్తుతానికి నడుస్తున్న థియేటర్లలో కొన్నింటిని అతికష్టమ్మీద లాగిస్తున్నారు. సినిమాల విడుదల తగ్గిపోయి థియేటర్ల నిర్వహణ భారంగా తయారవటమే ఇందుకు కారణమని చెప్పనవసరం లేదు.

టీవీ, ఓటీటీ ప్రభావంతో కళావిహీనం

టీవీ, ఇంటర్నెట్ పాపులర్ అయ్యాక సినిమాలకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత తరం హీరోలు సినిమాల సంఖ్యను బాగా తగ్గించేశారు. ఏడాదికి ఒక సినిమా కూడా చేయటం లేదు. రెండుమూడేళ్లకో సినిమా తాపీగా చేస్తున్నారు. ఫలితంగా థియేటర్లలో సినిమాల విడుదలకు వెతుక్కోవాల్సి వస్తోంది. దీనికితోడు ఓటీటీ ప్రభావం ఉండనే ఉంది. ఇన్ని కారణాలతో కొన్నేళ్లుగా తెనాలిలో థియేటర్ల నిర్వహణ భారంగా మారింది. నిర్వహణ ఖర్చులు భరించలేక ఒక్కో సినిమా థియేటర్ మూతపడుతూ వస్తోంది.

మూతపడిన థియేటర్లు

పట్టణంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీవేంకటేశ్వర థియేటర్, రత్నా టాకీస్‌లు మూసేశారు. వాటి స్థానంలో షాపింగ్ కాంప్లెక్సులు వచ్చాయి. ప్రముఖ సినీ నటి లక్ష్మీరాజ్యం తన ప్రియమైన స్నేహితురాలు కాంచనమాల కోసమని ఇక్కడే ఇల్లు, సినిమా థియేటర్‌ను నిర్మించుకున్నారు. బోసురోడ్డు చివర్లో ఆమె ముచ్చటపడి నిర్మించుకున్న రాజ్యం థియేటర్, తర్వాతి కాలంలో చేతులు మారింది. నిర్వహణ భారం కావటంతో కల్యాణ మండపంగా పెళ్లిళ్లకు వేదికగా మారింది. శ్రీసత్యనారాయణ టాకీస్ ఫంక్షన్ హాలుగా మారింది. వేద డీలక్స్ స్థానంలో షాపింగ్ మాల్ నిర్వహిస్తున్నారు. స్వాతంత్య్రం సిద్ధించిన మరుసటి ఏడాది స్వరాజ్ పేరుతో బోసురోడ్డులో నిర్మించిన స్వరాజ్ టాకీస్‌ను కొంతకాలం మూసేసి 2021లో కూల్చేశారు. గతేడాది అదే బోసురోడ్డులోని వీనస్ థియేటర్ అదృశ్యమైంది. ఈ రెండు ప్రదేశాల్లోనూ ఏ షాపింగ్ కాంప్లెక్సులో రానున్నాయి. బోసురోడ్డు, ఆ పరిసరాల్లోని ఐదు థియేటర్లలో ఇప్పుడు కేవలం పెమ్మసాని థియేటర్ మాత్రమే నడుస్తోంది. మొత్తమ్మీద పట్టణంలో తొమ్మిది సినిమా హాళ్లు ఉండగా వీటిలో మూడు జంట థియేటర్లు. మిగిలిన మూడు ఒంటరి థియేటర్లలో రెండు భారంగా నడుస్తున్నాయి.

2010లో మూతపడిన ఆషా థియేటర్

రైల్వేస్టేషన్‌కు దగ్గర్లోనే ఆషా డీలక్స్ థియేటర్ ఉంది. ఈ థియేటర్ పక్కనే ప్రియా, సంగమేశ్వర కాంప్లెక్సులు నడుస్తున్నాయి. రెండు కాంప్లెక్సుల్లో నాలుగు థియేటర్లు ఉన్నాయి. పక్కనే మూతపడి కళావిహీనంగా ఉన్న ఆషా డీలక్స్‌ను చూసే ప్రేక్షకులకు ఒకనాటి ఈ థియేటరు వైభవం తలపుకొస్తుంది. 1981లో చక్రవర్తి అనే వ్యాపారి నిర్మించారు. ఈ థియేటర్‌లో తొలిరోజున సూపర్‌స్టార్ కృష్ణ ప్రజారాజ్యం, మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డాన్సర్ సినిమాలు ప్రారంభ చిత్రాలుగా వేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, మురళీమోహన్, కృష్ణంరాజు వంటి హీరోల సినిమాలను ఎన్నింటినో ప్రదర్శించారు. పెదరాయుడు, సూరిగాడు, తాండ్ర పాపారాయుడు, బొబ్బిలి బ్రహ్మన్న వంటి ఎన్నో సినిమాలు ఆడాయి. ఈ థియేటర్ కూడా వివిధ కారణాలతో 2010లో మూతపడింది. ఈ థియేటర్ మళ్లీ సరికొత్త సొబగులు అద్దుకుంటుందన్న భావన ఎవరిలోనూ లేదు. ఏదొకరోజు ఏ షాపింగ్ కాంప్లెక్సో, మరో కల్యాణ మండపంగానో మారుతుందని అనుకునేవారు. ఇలాంటి నేపథ్యంలో ఈ థియేటర్ ముందు పొక్లెయిన్‌తో పనులు జరుగుతుండటం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. వాకబు చేస్తే ఆధునికీకరణ పనులు మొదలు పెట్టారని తెలిసింది. చక్రవర్తి కుమారుడు, ప్రస్తుత యజమాని డాక్టర్ జస్వంత్ ఇదే విషయాన్ని వెల్లడించారు. అనివార్య కారణాలతో మూసివేసిన ఆషా డీలక్స్ థియేటర్‌ను త్వరలోనే ప్రేక్షకులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ ప్రకారం పనులు ఆరంభించామని పేర్కొన్నారు. నిజంగా ఇది మాత్రం సినిమా ప్రేమికులకు ఖుషీఖబర్..!

నాడు వరుస సినిమాలతో కళకళ

ఒకప్పుడు వెండితెరకు స్వర్ణయుగమని తెలిసిందే. ఒక్కో హీరో ఏడాదికి పదికిపైగా సినిమాల్లో నటించేవారు. తెనాలికి చెందిన బుర్రిపాలెం బుల్లోడు సూపర్‌స్టార్ కృష్ణ, మరో హీరో మురళీమోహన్ పోటాపోటీగా ఒకే ఏడాది 17, 18 సినిమాల్లో నటించిన రికార్డు ఉంది. వరుస సినిమాల విడుదలతో థియేటర్లు కళకళలాడుతుండేవి. ప్రేక్షకులు ఆదరించిన సినిమాలు శతదినోత్సవాలు, రజతోత్సవాలను జరుపుకునేవి. దేవదాసు సినిమా రెండో రిలీజప్పుడు తెనాలిలో 300 రోజులు ఆడిందంటే ఇప్పటి ప్రేక్షకులకు అంత నమ్మశక్యం కాకున్నా నిజం.

రేపటి నుంచి కార్మెల్‌మాత ఉత్సవాలు



కొండపై కార్మెల్‌మాత ఆలయం



కార్మెల్ మాత స్వరూపం

ఫిరంగిపురం: కార్మెల్ కొండపై కార్మెల్ మాత ఉత్సవాలు ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహించనున్నట్లు బాల ఏసుదేవాలయ విచారణ గురువులు మాలపాటి ఫాతిమా మర్రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 14న ఆదివారం ఉదయం కొండపైన దివ్యపూజాబలి కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15న కొండపైన దివ్యపూజాబలి ఉంటుందని చెప్పారు. సాయంత్రం దివ్యసత్ప్రసాదంతో ప్రదక్షిణ ఆరాధన బాల ఏసుదేవాలయం నుంచి కొండమెట్ల వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు మేత్రాసన గురువులు చిన్నాబత్తిని భాగ్యయ్య పాల్గొంటారన్నారు. 16న ఉదయం దివ్యపూజాబలి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు కొండపైన తాగునీటి వసతి కల్పించామన్నారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పాఠశాల, కార్మెల్ మాత వసతి భవనం వద్ద భోజన వసతి కల్పించినట్లు వివరించారు. కార్మెల్‌మాత ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వస్తారు. మూడురోజులు నిర్వహించే దివ్యపూజాబలి కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారు.

అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలుగా అధికారులు



శిలాఫలకంపై కనిపించని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి పేరు



అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న టీడీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు నందం అబద్దయ్య

- నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల భవనం ప్రారంభోత్సవం
- ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి టీడీపీ నాయకునితో ప్రారంభోత్సవం
- శిలాఫలకంపై కనిపించని ఎంపీపీ పేరు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అందరికీ విద్యను అందించి మంచి చెడులను నేర్పే పవిత్రమైన వృత్తిలో ఉన్న విద్యాశాఖ అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వర్తించకుండా అధికార పార్టీ నేతల చేతిలో కీలుబొమ్మలుగా మారారు. నిబంధనలను తుంగలో తొక్కి ఏ అధికారిక హోదా లేని టీడీపీ నాయకుని చేత పాఠశాల భవనం ప్రారంభోత్సవాన్ని చేయించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలో మండల ప్రజాపరిషత్ పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో అదనపు పాఠశాల గదులను నిర్మించారు. ఆ గదులను ఇప్పుడు ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు శుక్రవారం ముహూర్తం ఖరారు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేరుతోపాటు సర్పంచ్ గంపల గంగాధరరావు, ఎంపీటీసీ అశోక్ కుమార్‌యాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ నల్లగొర్ల శ్రీలక్ష్మి, ఎంఈఓ–1 కాజ శ్రీనివాసరావు, ఎంఈఓ–2 కాజ లక్ష్మీనారాయణ, హెడ్‌మాస్టర్ ఎస్.జనార్దన ప్రసాద్ పేర్లను శిలాఫలకంపై ముద్రించారు. ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి పేరును మాత్రం శిలాఫలకంపై ముద్రించలేదు. ఇదిలా ఉండగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ హాజరు కాలేదు. విద్యాశాఖ అధికారులు ఏమనుకున్నారో ఏమో తెలియదు కానీ టీడీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షులు నందం అబద్దయ్యతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గిరాల మండలంలో ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యులు మేకతోటి అరుణ ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు గానీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గానీ వారికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదని తెలియవచ్చింది. అధికారపార్టీకి ఇచ్చిన ప్రాధాన్యం ప్రజాప్రతినిధులకు ఇవ్వకపోవడం పట్ల విద్యాధికులు, విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన త్రోబాల్ పోటీలు



బహుమతులందుకున్న విజేత జట్లలోని క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో రెండురోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల స్థాయి సీబీఎస్ఈ పాఠశాలల బాలికల త్రోబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. అండర్–14 విజేతగా జాన్సన్ గ్రామర్ స్కూల్ (హైదరాబాద్), అండర్–17 విజేతగా శ్రీవేద (మదనపల్లి), అండర్–19 విజేతగా టింపనీ స్కూల్ (విశాఖ) నిలిచారు. అనంతరం విజేతలకు సమాచార హక్కు రాష్ట్ర కమిషనర్ చావలి సునీల్, ప్రిన్సిపల్ అంథోని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య, పోటీల నిర్వహణ కార్యదర్శి ఫాదర్ భరత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనుపమ, రమాదేవి, సావేరి, సంధ్య, చీఫ్ కోచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో అర్ధరాత్రి తనిఖీలు

- బయటపడ్డ ఈసీజీ టెక్నిషియన్ల పని తీరు
- రాత్రి నుంచి కనపడని సిబ్బంది
- క్యాజువాల్టీలో ప్రైవేట్ ల్యాబ్ టెక్నిషియన్
- పోలీసులకు అప్పగింత


తనిఖీల సందర్భంగా ప్రైవేటు ల్యాబ్‌టెక్నీషియన్‌ను ప్రశ్నిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రోగులు, వారి సహాయకుల ఫిర్యాదుల మేరకు గుంటూరు జీజీహెచ్‌లో గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తనిఖీలు చేపట్టారు. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆస్పత్రిలో అత్యవసర చికిత్స విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో డొల్లతనం కనిపించిన చోట వైద్యులకు వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాజువాల్టి రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద ఒకరు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పని చేస్తున్నారని చెప్పారు. రోగుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మరొకరిని నియమించాలని ఆదేశించినా కాంట్రాక్టర్ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అర్ధరాత్రి తనకు ఫోన్ చేసి సిబ్బంది పని చేయడం లేదని రోగులు ఫిర్యాదులు చేస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా గమనించి మరొకరిని నియమించేలా కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరేడు నెలల నుంచి ఈసీజీ టెక్నీషియన్ రాత్రి పూట ఒకరు మాత్రమే పని చేస్తున్నారని, మరొకరు అర్ధరాత్రి నుంచి విధులకు దుమ్మా కొడుతున్నట్లు తనిఖీల్లో గుర్తించామన్నారు.

ఈసీజీ రోల్స్ దందాపై విచారణ

ఈసీజీ రోల్స్‌లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రోజూ ఈసీజీ రోల్స్ ఎవరు ఇస్తున్నారు, ఇండెంట్ ఎవరు ఇస్తున్నారు, ఎవరి ద్వారా తీసుకుంటున్నారు అనే అంశాలపై విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించామని సూపరింటెండెంట్ వెల్లడించారు. ఈసీజీ రోల్స్ బయటకు తీసుకుని వెళ్లి దందా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై వెంటనె విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు

డీపీపీ వైద్యుడు లేకపోవడంపై సూపరింటెండెంట్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర చికిత్స విభాగంలో అనధికారికంగా తిరుగుతున్న ప్రైవేట్ ల్యాబ్ టెక్నిషియన్‌ను గుర్తించి ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. అనంతరం ట్రయల్ రన్‌లో ఉన్న సీటీ స్కాన్ మిషన్‌ను ఆయన పరిశీలించారు. సర్వీస్ ఇంజినీర్‌తో మాట్లాడి వెంటనే రోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆధునిక కేర్ యూనిట్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

క్లుప్తంగా

26 పరుగులతో కర్నూలు విజయం

ఐదు వికెట్లు సాధించిన సాయి సూర్యతేజ్



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్ బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర క్రికెట్ పోటీల్లో శుక్రవారం కర్నూలు, కడప జిల్లాల జట్లు తలపడ్డాయి. ఇందులో కర్నూలు జట్టు 26 పరుగుల తేడాతో కడప జట్టుపై విజయం సాధించింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేసింది. కర్నూలు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో రెండవ రోజు ఓవర్ నైట్ స్కోర్ ఎనిమిది వికెట్లు నష్టానికి 117 పరుగులతో చివరిరోజు ఆట ప్రారంభించి మరో ఏడు పరుగులు జోడించి ఆలౌట్ అయింది. జట్టులోని పి.రోహిత్‌గౌడ్ 32 పరుగులు చేయగా, కడప బౌలర్ ఏ.శుభకాశ్యప్ మూడు వికెట్లు సాధించాడు. అనంతరం 186 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 160 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని జీ.వి.సాయిసాకేత్ 63 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఓటమి తప్పలేదు. కర్నూలు బౌలర్ కె.సాయిసూర్యతేజ్ 14ఓవర్లు వేసి 33 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు సాధించి కడప ఓటమిని శాసించాడు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పొలాల్లో రైతు బలవన్మరణం

చిలకలూరిపేట టౌన్: పొలాల్లో రైతు బలవన్మరణం పొందిన ఘటన చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..16వ నంబర్ జాతీయ రహదారిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పంట పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానిక రైతులు శుక్రవారం గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకుని అతని వద్ద ఉన్న ఆధారాల సేకరించారు. మృతుడు పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన బాడుగుల నాగరాజు(38)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నూతలపాడు గ్రామంలోని పురుగుల మందుల షాపులో పనిచేస్తూ 20 ఎకరాలను నాలుగేళ్లుగా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అందులో రూ.45 లక్షలు నష్టం వచ్చి అప్పుల పాలు కావడంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో చెప్పకుండా వచ్చి ఈ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య సామ్రాజ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యసమాజం

బిహార్ బృందం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న బిహార్ బృందం సభ్యులు

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బిహార్‌కు చెందిన రూరల్ లైవ్లీహుడ్స్ రాష్ట్ర కార్యాలయం ప్రతినిధుల బృందం అనిల్‌కుమార్‌యాదవ్, వంశీకృష్ణారెడ్డి, కునాల్‌కిషోర్, కౌటిల్యకుమార్, సంతోష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రాజకుమారి ఇక్కడి రైతులు అవలంబిస్తున్న పద్ధతుల గురించి బిహార్ ప్రతినిధులకు వివరించారు. ప్రకృతి సేద్యంలో మహిళా సంఘాల పాత్ర గురించి సంఘ సభ్యులతో బిహార్ ప్రతినిధులు సమావేశమై చర్చించారు. గ్రామానికి చెందిన ప్రకృతి రైతు గురవయ్య తాను అవలంబిస్తున్న యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం ఏ గ్రేడ్ మోడల్‌ను బిహార్ ప్రతినిధులు సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌పీసీ వెంకటరావు, ఏవో శ్రీనివాసరావు, డీఎల్‌ఎంపీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: పొన్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అరకొరగా సరఫరా చేసిన ఘటనను వెలుగులోకి తెస్తూ గురువారం సాక్షి దినపత్రికలో ''అందని పాఠ్య పుస్తకాలు-ప్రారంభం కాని పాఠాలు'' శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు మండలంలోని 88 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5,557 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇండెంట్ ప్రకారం ఐదు విడతల్లో వెండర్ నుంచి మండల స్టాక్ పాయింట్‌కు వచ్చినట్లు సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. పాఠ్య పుస్తకాలు వచ్చిన వెంటనే పాఠశాలలకు పంపిణీ చేశామని, ఒకటో తరగతి తెలుగు రీడర్ 60, ఏడో తరగతి ఇంగ్లిష్ రీడర్ 50 పుస్తకాలు రావాల్సి ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇండెంట్ ప్రకారం బ్యాగులు, యూనిఫాం, బెల్టులు, నోటు పుస్తకాలు, బూట్లు నూరు శాతం పంపిణీ చేశామని తెలిపారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలి



తెనాలి రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు పిలుపు మేరకు యూనియన్ తెనాలి శాఖ సభ్యులు నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. స్థానిక సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తెనాలి శాఖ చైర్మన్, కార్యదర్శి నరేష్, వేణుగోపాల్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. జి. రవిబాబు, ఎం.నరేష్, బి.ప్రభాకరబాబు, గోపినాయక్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రసన్నకుమార్, రాజశేఖర్ పిచ్చియ్య, వినయ్‌కుమార్, మల్లేశ్వరి తదితర రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు భరోసా హామీని తక్షణమే అమలు చేయాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలి: రైతుభరోసా పథకాన్ని రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ఎన్డీఏ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలోని పేరంటాలమ్మ గుడి వద్ద శుక్రవారం జరిగిన రైతుల సమావేశంలో శివసాంబిరెడ్డి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థికసాయం చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు గుర్తుచేశారు. అదేవిధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుకు అసెంబ్లీలో చట్టం చేయాలని కోరారు. పంట కాల్వలు, మురుగు కాల్వల్లో తూటాకు, గుర్రపుడెక్కను తొలగించాలని కోరారు. కౌలురైతులకు సాయానికి అడ్డంకిగా మారిన భూయజమాని సంతకం అనే నిబంధనను తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లంకిరెడ్డి సాంబిరెడ్డి, గుదిబండి శివరామిరెడ్డి, అవుతు నాగిరెడ్డి, అత్తోట వీరయ్య, తాడిబోయిన ఏడుకొండలు, వంగా మల్లారెడ్డి, వి.విజయరాణి, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విట్-ఏపీలో 48 మంది పేద విద్యార్థులకు స్టార్స్ పథకం ద్వారా ఉచిత ప్రవేశం


విట్-ఏపీ విశ్వ విద్యాలయంలో ఉచిత ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులతో వీసీ కోటారెడ్డి

తాడికొండ: వీఐటీ(విట్) ఏపీ విశ్వ విద్యాలయంలో ఏపీలోని 26 జిల్లాలకు చెందిన 52 మంది పేద విద్యార్థులలో 48 మందికి ఉచిత ప్రవేశాలు అందించినట్లు వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలలో జిల్లా టాపర్లుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు స్టార్స్ (సపోర్ట్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) పథకం ద్వారా ఉన్నత విద్యను ఉచితంగా అందించేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. వీరికి విద్య, వసతి సౌకర్యాలలో 100 శాతం ఫీజు మినహాయింపును అందించనున్నట్టు వివరించారు. ఈ పథకాన్ని తొలుత తమిళనాడులోని వెల్లూరులో వీఐటీ విశ్వ విద్యాలయంలో 2008లో వ్యవస్థాపక చాన్స్‌లర్ జి.విశ్వనాథన్ చేతుల మీదుగా ప్రారంభించి తదనంతరం వీఐటీ-చెన్నై, వీఐటీ-ఏపీ, వీఐటీ-భోపాల్ క్యాంపస్‌లకు విస్తరించినట్లు తెలిపారు. విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయం విద్యార్థుల కలలను సాకారం చేస్తుందన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాన్ ప్రదీప్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ మిశ్రా, స్టార్ పథకం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకట లక్ష్మి, చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గుంటి దయానంద్ పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో శ్రీమేధ చైర్మన్ నందకిషోర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గురువారం ప్రకటించిన సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో శ్రీమేధ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. కొత్త పేటలోని శ్రీమేధ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నందకిషోర్ మాట్లాడుతూ తమ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో టాప్ మార్కులతో పాటు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గత 19 ఏళ్లుగా సీఏ సీఎంఏ కోర్సుల్లో 450కు పైగా అఖిల భారత స్థాయిలో ర్యాంకులు సాధించామని తెలిపారు. ప్రస్తుత ఫలితాల్లో తమ విద్యార్థి ఎస్.సంతోష్‌కుమార్ 400 మార్కులకు గాను 338, షేక్ ఫిర్దోస్ 316, బి.నరసింహా సాయి ధీరజ్ 312, బి.వెంకట శివ సాయి కార్తీక్ 310, ఎస్.భువన్ వెంకట సాయి 304, కె.తిరుమల సాయి సంతోష్ 304, వి.శరణ్య లక్ష్మి 302, బి.రాహుల్ 302, ఎస్.భవ్య సాయి 300, ఎస్. కిషోర్ 300, షేక్ సలాం 300 వంటి టాప్ మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్మీడియెట్ నుంచి సీఏ, సీఎంఏ ఫౌండేషన్ కోర్సులకు కాయిన్ ప్రోగ్రాం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అందిస్తున్న శిక్షణ ద్వారా తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి అభినందించారు.

రాయితీ విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి

తెనాలి: గుంటూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ముఖ్యంగా గాంధీనగర్, గంగానమ్మపేట రైతుబజార్లలో కొత్తగా ప్రారంభించిన రాయితీ ధరల దుకాణాలను, సూపర్ మార్ట్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్లలోనే కాకుండా పెద్దపెద్ద మార్టుల్లోనూ కందిపప్పు, బియ్యాన్ని రాయితీ ధరకు వినియోగదారులకు అందించే దిశగా చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్టు జిల్లా తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి వెల్లడించారు. గాంధీనగర్, గంగానమ్మపేటలో రైతు బజార్లలోని రాయితీ దుకాణాలు, బోసురోడ్డులోని ఉషోదయ, బుర్రిపాలెం రోడ్డులోని మోర్ మార్టులనూ తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారులు సందర్శించి అక్కడి విక్రయాలను పరిశీలించారు. గాంధీనగర్ లోని రైతు బజార్లో కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రంలో తూకం వేసే కాటా రాళ్ల సక్రమంగా ఉన్నదీ లేనిది పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీ సరుకులు కూడా తనిఖీ చేశారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సరుకులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ విక్రయ కేంద్రాల్లో తూకంలో పొరపాట్లు వస్తే తూనికలు కొలతల శాఖ అధికారులకు తెలియజేయాలని కొండారెడ్డి కోరారు. తెనాలి తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శేషసాయి టెక్నికల్ అసిస్టెంట్ రవి, తెనాలి సీఎస్ డీటీ మూర్తి పాల్గొన్నారు.

విద్యాదాత సుబ్బరాయ శ్రేష్టి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


సుబ్బరాయ శ్రేష్టి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను వందేళ్ల కిందటే పట్టణ ప్రజలకు అందించిన వితరణశీలి సుబ్బరాయ శ్రేష్టి అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కొనియాడారు. శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం సుబ్బరాయ శ్రేష్టి 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, కళాశాల పాలక వర్గ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది సుబ్బరాయ శ్రేష్టి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పదని గుర్తించి 75 సంవత్సరాల కిందటే కళాశాలను ఏర్పాటు చేసిన మహనీయులు సుబ్బరాయ శ్రేష్టి అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపిలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సోమశేఖర్

చీరాల: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 6 కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చీరాల టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడికి యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దండుబాట రోడ్డులో మాడపాటి వీరంజనేయులు, రాజు జయలక్ష్మి, వల్లభ శామ్యూల్, నల్లగొర్ల రాజేష్, కావూరి నాని గంజాయి విక్రయిస్తుండగా దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. చీరాల టూటౌన్ సీఐ, ఎస్ఐ ఐ.వెంకటేశ్వర్లు, హెచ్ కానిస్టేబుల్ డీ శివప్రసాద్, ఎం.శ్రీనివాస్, షేక్ నాగూర్‌వలి, ఎస్.ఆంజనేయులు, మహిళా కానిస్టేబుల్ ఎస్.స్వరూపలను ఎస్పీ అభినందించారు.

వైభవంగా బోనాల మహోత్సవం


అమ్మ వారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పిడుగురాళ్ల: పట్టణంలోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బోనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మొదటి శుక్రవారం కావడంతో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి చీర, జాకెట్, వడి కట్టు బియ్యం, పూలు, గాజులు, పసుపు కుంకుమతో బోనాలను సమర్పించారు. ఆలయ పూజారి పూర్ణానందశాస్త్రి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

త్రికోటేశ్వరుడి ఆదాయం రూ.81.72 లక్షలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం హుండీ కానుకల్ని శుక్రవారం లెక్కించారు. దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, సింగరుట్ల లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం ఈవో సీహెచ్.నాగిరెడ్డి పర్యవేక్షించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.76,63,351, అన్నదానం హుండీ ద్వారా రూ.5,09,440 ఆదాయం లభించినట్టు వివరించారు. 125 రోజులకు గాను మొత్తం రూ.81,72,791 వచ్చినట్టు తెలిపారు. దీంతోపాటు వెండి 695 గ్రాములు, బంగారం 36.500గ్రాములు, విదేశీ కరెన్సీ 105 అమెరికన్ డాలర్లు, 15 ఆస్ట్రేలియన్ డాలర్లు, రెండు సింగపూర్ డాలర్లు, 100 పౌండ్లు సూడాన్ కరెన్సీ హుండీల ద్వారా వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో కెనరా బ్యాంక్ తంగేడుమల్లి బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూ ఆరోగ్యం పదిలం

బాపట్ల జిల్లా వనరుల కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల

అద్దంకి: ప్రకృతి వ్యవసాయంతో భూ ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల అన్నారు. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకం వల్ల భూ ఆరోగ్యం పాడై భావితరాలకు సారం లేని భూములను అప్పగించాల్సి వస్తుందన్నారు. కలవకూరు రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన 'ప్రకృతి వ్యవసాయం-రసాయన ఎరువుల సమతుల్యత', భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయం అనే శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మనిషి ఆరోగ్యం, భూ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఆలోచించాలన్నారు. భూముల్లో అధిక దిగుబడుల కోసం వాడే రసాయన ఎరువుల వలన మనుషులకు అనేక రకాల జబ్బులు, రావడంతోపాటు, భూ ఆరోగ్యం పాడైపోయి విత్తనాలు వేసినా పంటలు పండే పరిస్థితి ఉండదని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని చెప్పారు. భూసార పరీక్షలు చేయించి అవసరమైన మేరకే రసాయన ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ మురళీధర్ నాయక్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, మందులు సిఫారసు మేరకు మార్చిమార్చి చల్లుకోవాలన్నారు. అలా కాకుండా ఒకే మందు పిచికారీ వలన వ్యాధికారక జీవులు వాటిని తట్టుకోగలిగే సామర్థ్యాన్ని పెంచుకుంటాయని వివరించారు. ప్రతి రైతు తక్కువ రకం మందులను మార్చి మార్చి వాడి చీడపీడలను నివారించుకోవాలని చెప్పారు. అధిక దిగుబడుల కోసం అత్యధిక మోతాదులో రసాయన ఎరువులను వాడటం వలన భూ ఆరోగ్యం, మనిషి ఆరోగ్యం పాడవుతుందని వివరించారు. ఏడీఏ ధన్‌రాజ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి, మండల వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.